ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
5
శనివారం, 29 జూన్ 2024



పాపికొండల విహారయాత్ర తాత్కాలికంగా నిలిపివేత

భద్రాచలం జూన్ 28: ఆంధ్ర- తెలంగాణలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జాతీయ స్థాయిలో పేరుగాంచిన పాపికొండల విహారయాత్రను నాలుగు రోజులపాటు తాత్కాలికంగా నిలిపివేస్తూ చింతూరు ఐటీడీఏ పీవో, కే.చైతన్య అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో గోదావరి నీటిమట్టం పెరిగే అవకాశం ఉండటం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ముందస్తు జాగ్రత్తగా గోదావరిపై లాంచీలు, పడవల రాకపోకలను నిలిపివేసినట్టు పేర్కొన్నారు. పరిస్థితులు అనుకూలించిన అనంతరం పాపికొండల విహారయాత్ర పునః ప్రారంభం కానుంది.

కలెక్టర్‌ని కలిసిన డీసీసీ, టీపీసీసీ సభ్యులు



కలెక్టర్‌ను కలిసిన డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, టీపీసీసీ సభ్యులు

సుజాతనగర్, జూన్ 28 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జితేష్ వి.పాటిల్‌ను డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి నోట్ బుక్‌లను కలెక్టర్‌కు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుజాతనగర్‌లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ముగిసిపోవడంతోపాటు, పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారని నాగ సీతారాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతిర్యాల రవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, కొత్తగూడెం ఓబీసీ పట్టణ అధ్యక్షుడు జయప్రకాష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఏనుగుల అర్జున్‌రావు, రౌతు నర్సింహారావు, బొబ్బల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేట ఫ్యాక్టరీలో పామాయిల్ గెలలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

‘ఆయిల్‌పామ్’ హబ్‌గా తెలంగాణ

- వచ్చే ఐదేళ్లలో 10 లక్షల ఎకరాల్లో సాగుకు ప్రణాళిక
- టన్ను ధర రూ.15 వేలకు తగ్గకుండా చూడాలని కేంద్రాన్ని డిమాండ్ చేశాం
- అశ్వారావుపేటలో హార్టికల్చర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు: మంత్రి తుమ్మల
- అశ్వారావుపేట, దమ్మపేటలో పామాయిల్ పరిశ్రమల సందర్శన

6



దేశంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు

- మతోన్మాదులకు గుణపాఠం చెప్పిన ఎన్నికల ఫలితాలు
- బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే నిలిపివేయాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ
- నగరంలో మొదలైన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

వివరాలు : 6లో

జిల్లాలో సాగు చేయకుండా ఖాళీగా ఉంటున్న పట్టా భూములపై క్షేత్రస్థాయిలో సర్వే కొనసాగుతోంది. సాగు భూములా..? ఖాళీ భూములా...? అన్న లెక్క పక్కాగా తేలనుంది. రైతు పట్టాదారు పాస్‌పుస్తకాల్లో ఉన్న భూములన్నింటికీ రెవెన్యూ రికార్డుల ఆధారంగా ‘రైతుబంధు’ కింద ప్రతీ ఏటా రైతులకు ఎకరానికి రూ. 10వేల చొప్పున సహాయం అందుతున్న విషయం విదితమే. ఇందులో వ్యవసాయ సాగు భూములే కాకుండా, రియల్ వెంచర్లుగా మారిన భూములు, గుట్టలు, క్వారీలు, ప్రభుత్వం సేకరించిన ఎన్ఎస్‌పీ భూములు, రాష్ట్రీయ, జాతీయ రహదారుల నిర్మాణానికి, ప్రభుత్వ అవసరాలకు తీసుకున్న భూములు, పట్టా భూములు.. ఇలా సాగులో లేకున్నా రైతుబంధు సాయం అందుతోంది. అయితే తాజాగా చేపట్టిన సర్వేతో సాగులో లేని భూముల వివరాల లెక్క పక్కాగా తేలనుంది. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో సర్వే ప్రక్రియ సాగుతోంది. రాష్ట్రంలో ఇందుకు ఐదు జిల్లాలను మోడల్‌గా ఎంపిక చేసి సర్వే చేస్తున్నారు. అందులో ఖమ్మం జిల్లాతోపాటు సంగారెడ్డి, కామారెడ్డి, కరీంనగర్, హన్మకొండ జిల్లాల్లో ఈ సర్వే సాగుతోంది.



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

తేలనున్న సాగు భూముల లెక్క

క్షేత్రస్థాయిలో పక్కాగా మొదలైన సర్వే

- రంగంలోకి వ్యవసాయ శాఖ ఏవోలు, ఏఈవోలు, గ్రామ కార్యదర్శులు
- ల్యాండ్ యుటిలైజేషన్ సర్వే యాప్‌లో వివరాల నమోదు
- ఖమ్మం జిల్లాలో 53 వేల సర్వే నెంబర్లలో ఖాళీ భూములు
- సాగుయేతర భూములకు ‘రైతుబంధు’ పొందుతున్న వారిలో గుబులు

ఖమ్మం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రతీ ఏట వానాకాలం, యాసంగి సీజన్‌లో వ్యవసాయాధికారులు సాగు వివరాలను నివేదిక ద్వారా సిద్ధం చేయడం ఆనవాయితీ. గ్రామాల్లో సర్వే నెంబర్ ప్రకారం సంబంధిత రైతు ఏ పంట వేశారో ఆ పంట వివరాలను నమోదు చేస్తున్నారు. అయితే కొన్ని సర్వే నెంబర్లలో ఏ పంట వేయటంలేదని సర్వే నెంబర్లలో భూములను ఖాళీగా చూపుతున్నారు. ఇలా ఖాళీగా ఉంటున్న భూములు పట్టాదారు పాస్‌పుస్తకాల్లో మాత్రం సాగు భూములుగా ఉంటున్నాయి. ఇందులో మైనింగ్ క్వారీలు, జాతీయ, రాష్ట్రీయ రహదారులకు, ప్రభుత్వ అవసరాలకు తీసుకున్న భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు పలు గుట్టలు, గ్రావెల్ క్వారీలు ఇలా సాగుకు ఉపయోగపడని భూములు కూడా వ్యవసాయ భూములుగా ఉంటున్నాయి.

వీటికి రైతుబంధు కూడా రెవెన్యూ పట్టాదారు పాస్‌పుస్తకాల ఆధారంగా అందిస్తున్నారు. వాస్తవానికి వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారితే వాటిని అగ్రికల్చర్ నుంచి కమర్షియల్‌గా మార్పు చేయాల్సి ఉంది. కానీ రెవెన్యూ అధికారులు పట్టాదారు పుస్తకాల్లో మార్పు చేయడంలేదు కమర్షియల్‌గా మారిన భూముల వివరాలు గుర్తించకపోవడంతో వ్యవసాయ సాగు భూములుగా భావించి రైతుబంధు అందిస్తున్నారు. ఈ క్రమంలో పంటలు వేయకుండా ఖాళీగా ఉంటున్న వ్యవసాయ భూములను గుర్తించేందుకు ఖాళీ సర్వే నెంబర్లపై పైలెట్ ప్రాజెక్టు తీసుకుని ప్రభుత్వం సర్వే చేపట్టింది. ఖమ్మం జిల్లాలో 53వేల సర్వే నెంబర్లలో ఏ పంటలు వేయకుండా ఖాళీగా ఉంటున్నాయి. వీటిల్లో కూడా ఖమ్మంరూరల్, నేలకొండపల్లి మండలాల్లో అత్యధిక సర్వే నెంబర్లు ఉండడం గమనార్హం. జిల్లాలో అన్ని మండలాల్లో సాగుచేయకుండా ఖాళీగా ఉంటున్న సర్వేనంబర్ల భూముల వాస్తవ పరిస్థితి ఇప్పుడు బయటపడనుంది.

ఈ క్షేత్రస్థాయిలో భూముల సర్వేకు వ్యవసాయశాఖ ఏవోలు, ఏఈవోలు, గ్రామ కార్యదర్శులు తదితర సిబ్బందిని వినియోగిస్తున్నారు. వీరు గ్రామాల్లో ఖాళీగా ఉంటున్న వ్యవసాయ భూముల సర్వేనెంబర్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ల్యాండ్ యుటిలైజేషన్ సర్వే యాప్ ఓపెన్ చేసి అందులో అడిగిన విధంగా వ్యవసాయ భూమికి ఫలానా సర్వే నెంబరు అనువుగా ఉందా లేదా ఉంటే ఆ భూమి ఫొటోతో జియోట్యాగ్ చేయాలని అలాగే క్రాప్ ఎందుకు వేయడం లేదు.. అందుకు సంబంధించిన కారణాలను తెలియజేయాలని, అలాగే ఎక్కడ ఆ భూమిని భూసేకరణ కింద ప్రభుత్వ అవసరాలకు సేకరించారా కొండలు, గుట్టలు ఏమైనా ఉన్నాయా చెరువుల, కాలువలు తవ్వి సాగుకు అనుకూలంగా లేవా, క్వారీల తవ్వకాలు జరుగుతున్నాయా ఉంటే వాటికి సంబంధించిన వివరాలను సర్వేలో యాప్‌లోనే సమాచారం పొందుపరచాల్సి ఉంటుంది. ఈ సర్వే ద్వారా వ్యవసాయ భూములుగా ఉన్నాయా? వ్యవసాయేతర భూములుగా ఉన్నాయా? లేక ప్రభుత్వమే పలు రకాల అభివృద్ధి పనులకు సేకరించిందా.. కొండలు, గుట్టలు, ఖనిజ క్వారీలుగా ఉన్నాయా, అలాగే రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారి సాగు చేయడం లేదా అన్న విషయాలు గుర్తించనున్నారు. దీంతో రైతు భరోసా పథకం అమలు విషయంలో వాస్తవ పరిస్థితి ప్రభుత్వానికి లెక్కతేలనుంది. ఈ సర్వేలో వాస్తవాల పరిస్థితిని ప్రభుత్వం అంచనా వేసుకుని ఇతర జిల్లాల్లో సర్వే జరిగే వీలుంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో ప్రతిఏటా 7లక్షల 40 వేల ఎకరాలకు 3 లక్షల 33వేల మంది రైతులు వానాకాలం, యాసంగి సాగుకు రైతుబంధు అందుకుంటున్నారు. ప్రతి వానాకాలం సీజన్‌లో రూ.360కోట్లు, యాసంగిలో రూ.340కోట్లు రైతుబంధు కింద రైతులు పొందుతున్నారు.

‘రైతుబంధు’లో మార్పుల కోసం...

6

- నేటి నుంచి జూలై 5 వరకు సదస్సులు
- రైతులు పాల్గొనేలా చూడాలి: డీసీవో

సీతారామ ప్రాజెక్ట్ ఘనత కేసీఆర్‌దే

- స్థానికంగా నీళ్లు ఇచ్చిన తర్వాతే బయటకు తరలించాలి
- పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు
- కేసీఆర్ కృషితోనే సీతారామ నిర్మాణం
- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్
- మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత నామా నాగేశ్వరరావు



అశ్వాపురం మండలంలోని సీతారామ పంపుహౌస్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రేగా కాంతారావు, ఇతర నేతలు



రామాలయ ప్రాంగణంలో పర్యాటక మంత్రిత్వ శాఖ అధికారులు

‘ప్రసాద్’ పనులను వేగవంతం చేయాలి

- పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృపాకర్

భద్రాచలం జూన్ 28: భద్రాచలంలో ప్రసాద్ (తీర్థయాత్ర పునరుజ్జీవనం, స్పిరిచ్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్)పథకంలో నిర్వహించే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృపాకర్ అన్నారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో ‘ప్రసాద్’ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృపాకర్ శుక్రవారం పరిశీలించారు. భద్రాద్రి దేవస్థానం పరిధిలో ప్రసాద్ పథకం కింద రూ. 41కోట్లు కేటాయించగా అందులో రూ. 22 కోట్లతో చేపడుతున్న ఇంజనీరింగ్ అభివృద్ధి పనుల పురోగతిని శుక్రవారం ఆయన రాష్ట్ర పర్యాటక శాఖ, భద్రాద్రి దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. శిల్పినగర్‌లో చేపడుతున్న వ్రత మండపం, భక్తుల మౌలిక వసతుల భవన సముదాయం పనుల పురోగతిని పరిశీలించి పనుల వేగం పెంచాలన్నారు. బ్రిడ్జి సెంటర్లో క్యాంటీన్ బ్లాక్‌ను ఆయన పరిశీలించారు. పర్ణశాలలో నిర్మిస్తున్న భక్తుల మౌలిక భవన వసతుల సముదాయం పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. భద్రాద్రి రామాలయ ప్రాంగణంలో షెడ్ల నిర్మాణం, క్యూలైన్ల ఏర్పాటు, టైల్స్ వేయడం లాంటి పనులు చేపట్టాల్సి ఉండగా భద్రాద్రి దేవస్థానం మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్న క్రమంలో ఆ ప్లాను ఖరారు అయిన అనంతరం ఈ పనులను చేపట్టనున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ అధికారి ప్రవీణ్, రాష్ట్ర పర్యాటక శాఖ అధికారి వై ఆర్‌కె రాజు, డీఈ రామకృష్ణ ఏఈ ప్రసాద్, భద్రాద్రి దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం ఈఈ వి. రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

తప్ప తాగి విధులకు వచ్చిన

ఉపాధ్యాయుడిపై వేటు

సస్పెండ్ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి

ఇల్లెందు టౌన్, జూన్ 28: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మద్యం సేవించి విధులకు హాజరైన ఓ ఉపాధ్యాయుడిపై వేటు పడింది. ఇల్లెందు పట్టణంలోని ఇల్లెందులపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాల్వ సుధాకర్ ప్రతీ రోజు మద్యం సేవించి విధులకు హాజరవుతున్నాడు. ఈ క్రమంలో గురువారం మద్యం మత్తులో విధులకు హాజరై విద్యార్థినులను అసభ్యకర పదజాలంతో దూషించాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో వారు వచ్చి ఉపాధ్యాయుడిని తరగతి గదిలో నిర్బంధించి పాఠశాల ఎదుట బైఠాయించారు. ఈ విషయమై విచారణ జరిపిన జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి శుక్రవారం ఉపాధ్యాయుడు సుధాకర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు, తక్షణమే ఆదేశాలు అమలు చేసే విధంగా మండల విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు

విద్యార్థిని కొట్టిన ఘటనపై విచారణ

దుమ్ముగూడెం జూన్ 28: చింతగుప్ప మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఒకటో తరగతి చదువుతున్న తుర్రం అభిషేక్‌ను టీచర్ బి.రాజా అకారణంగా కొడుతున్నారనే వివాదంపై మండల విద్యాశాఖ నోడల్ అధికారి రామారావు శుక్రవారం విచారణ నిర్వహించారు. బాధిత విద్యార్థి తల్లిదండ్రులు రాజు, కమల ఈ విషయమై ఎంఈవోకు ఈనెల 27న ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. జరిగిన సంఘటనపై టీచర్ రాజా, విద్యార్థి తల్లిదండ్రులు, హెచ్ఎంల నుంచి విచారణ అధికారి రామారావు వివరాలను సేకరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ టీచర్ రాజా పాఠశాలలో బోధనా విధులను కొనసాగించడానికి వీల్లేదంటూ విద్యార్థి తల్లిదండ్రులు వాంగ్మూలమిచ్చారు. విచారణ నివేదికను శనివారం ఎంఈవోకు అందజేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విచారణలో పర్ణశాల ఇన్‌చార్జి హెచ్ఎం, కాంప్లెక్సు సిబ్బంది ఏజే ప్రభాకర్ ఉన్నారు.

'సీతారామ' పంప్‌హౌస్‌ను సందర్శించిన కలెక్టర్

» ప్రాజెక్టు స్వరూపంపై ఆరా

అశ్వాపురం, జూన్ 28: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని బీజీ కొత్తూరు వద్ద నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ మొదటి దశ పంప్‌హౌస్‌ను శుక్రవారం భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సందర్శించారు. పంప్‌హౌస్ ట్రయల్‌రన్ విజయవంతమైన నేపథ్యంలో ప్రాజెక్ట్ వివరాలను తెలుసుకునేందుకు కలెక్టర్ వచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మ్యాప్ ద్వారా ప్రాజెక్ట్ వివరాలను కలెక్టర్‌కు తెలిపారు. ఉమ్మడి జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలో సుమారు 10 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ప్రాజెక్ట్‌ను నిర్మాణం చేపట్టినట్లు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ పంప్‌హౌస్ మోటార్లు, ట్రయల్‌రన్ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో వరప్రసాద్, ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్, ఏఈ రమేష్‌లు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రైతుల వినతి

సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ సందర్శనకు వచ్చిన కలెక్టర్‌కు తుమ్మలచెరువు ఆయకట్టుకు సాగునీరు అందించాలని కోరుతూ బీజీ కొత్తూరు రైతులు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా మండలంలోని అన్ని చెరువులను నింపిన తర్వాతనే గోదావరి జలాలను ఇతర ప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, మొండికుంట మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఆయకట్టు రైతులు ఉప్పల్‌రెడ్డి, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీపీ సుజాత, రైతులు

ఆయిల్ రికవరీలో రైతులకు నష్టం రాదు

» ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి

దమ్మపేట, జూన్, 28: పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం హారిజంటల్ పద్ధతిలో కాని, వర్టికల్ పద్ధతిలో కానీ నిర్మించినా ఆయిల్ రికవరీలో ఎలాంటి నష్టం రాదని ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో శుక్రవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో అప్పుడున్న టెక్నాలజీ ప్రకారం హారిజంటల్ పద్ధతిలో ఫ్యాక్టరీ నిర్మించామని, ప్రస్తుతం 90 టన్నుల సామర్థ్యంతో ఆధునీకీకరించిన ఫ్యాక్టరీని వర్టికల్ పద్ధతిలో నిర్మించామని, అయినా ఆయిల్ రికవరీలో ఎలాంటి నష్టాలు ఉండవని అన్నారు. కొందరు రైతులలో పాతపద్ధతిలో రికవరీ రేటు ఎక్కువ వచ్చిందని, ప్రస్తుతం రికవరీ రేటు తక్కువగా వస్తున్నదనే అపోహలు నిజం కావన్నారు. ఏపీలోని ప్రైవేటు ఫ్యాక్టరీలన్నీ వర్టికల్ పద్ధతిలోనే నిర్మిస్తున్నారని, నష్టాలు వస్తే వారెందుకు ఈ పద్ధతిని అవలంబిస్తారని అన్నారు. రికవరీ రేటు రైతులు తరలించే గెలలపై ఆధారపడి మాత్రమే ఉంటుందని అన్నారు. ఆయిల్‌ఫెడ్ ప్రభుత్వరంగ సంస్థ అని, ఫ్యాక్టరీ మనగడతో పాటు రైతులకు నష్టల బారినపడకుండా చూడటం తమ బాధ్యత అని అన్నారు. ఆయిల్ రికవరీపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులు సహకరించాలని కోరారు. ఈసమావేశంలో ఫ్యాక్టరీస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్, డిప్యూటి మేనేజర్ నాగుబాబు, ప్రీయూనిక్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి



వేంకటేశుడికి సహస్ర దీపాలంకరణ

సహస్ర దీపాలంకరణ వేలుగులో శ్రీ వేంకటేశ్వర స్వామి

కొత్తగూడెం సాంస్కృతికం, జూన్ 28: శ్రీ పద్మావతి గోదా సమేత కళ్యాణ వేంకటేశ్వరుడి పుష్కర బ్రహ్మోత్సవాలు కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరుడి ఆలయంలో అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం శ్రీ వేంకటేశ్వరస్వామివారికి సహస్రదీపాలంకరణ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. వేయ్యి దీపాలను భక్తులు వెలిగించి తన్మయత్వం చెందారు. దీపాల వెలుగులో ఆలయం కాంతులీనింది. ఏడుకొండలవాడ. వేంకటరమణా గోవిదా...గోవిందా... అంటూ స్వామివారి నమస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అదేవిదంగా 29తేదీన ఉదయం శ్రీవేంకటేశ్వర స్వామివారికి శ్రీచక్రస్నానం, అన్నదానం(నారయణ సేవా)కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వీవీ వర్ధన్‌రావు, వాసిరెడ్డి ప్రసాద్, చిగురుపాటి శ్రీనివాస్, శ్రీరాంబాబు, గోల్లపూడి శ్యంమ్‌సుందర్ భక్తులు పాల్గొన్నారు.



దురాశ దుఖాఃనికి చేటని నానుడి. అదే సమయంలో ఆన్‌లైన్ మోసాలు ఎన్ని వెలుగులోకి వస్తున్నప్పటికీ ప్రజలు మళ్లీ.. మళ్లీ మోసపోతూనే ఉన్నారు. అత్యాశకు పోతే అసలుకే మోసం వచ్చింది జనాలను నమ్మించటానికి కొంత మందికి తానే ముందుగా డబ్బులు కట్టి, కొన్ని రోజులు వారి ఖాతాల్లో డబ్బులు వేసాక, నమ్మకం కలిగి వాళ్లే డబ్బులు చెల్లించేవారు. దీనికి తాజా ఉదాహరణ మూడు రోజుల క్రితం ఖమ్మం జిల్లా, నేలకొండపల్లిలో వెలుగులోకి వచ్చిన ఎస్ఎస్‌వీ ఉదంతం.

అత్యాశతో అసలుకే ఎసరు

» ఆన్‌లైన్ మనీ స్కీమ్ వలలో చిక్కిన జనం

» నేలకొండపల్లి కేంద్రంగా మోసం

» బలహీనతలన ఆసరా చేసుకొని కుచ్చుటోపీ

» ఇంకా లెక్కతేలని డిపాజిట్ల వ్యవహారం

నేలకొండపల్లి, జూన్ 28: కంపెనీలో డిపాజిట్ చేసిన సొమ్ముకు 200 రోజుల్లోనే రెట్టింపు ఇస్తామని ఊదరగొడుతూ ప్రజలను నమ్మించారు. పెద్ద సంఖ్యలో ఏజెంట్లను నియమించుకుని తద్వారా కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన ఎస్ఎస్‌వీ సంఘటన వెలుగులోకి రావటంతో, ఎస్ఎస్‌వీలో డిపాజిట్ చేసిన వారు గగ్గోలు పెడుతున్నారు. ప్రజలను సునాయాసంగా నమ్మించి ఎలా మోసం చేయొచ్చో ఈసంఘటన చెప్పకనే చెపుతున్నది. బాధితులు ఎంత మంది ఉన్నప్పటికీ చెన్నారానికి చెందిన మానుకొండ రామారావు నేలకొండపల్లి పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయటంతో రంగంలోకి దిగిన పోలీసులు సంస్థ సూత్రధారిని, అందుకు సహకరించిన మరో ఇద్దరినీ అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేయటంతో ఒక్కొక్కరిగా బాధితులు బయటకు వస్తున్నారు కానీ తమ పేర్లు చెప్పటానికి ఇష్టపడటం లేదు.

ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం మంగాపురం తండాకు చెందిన భూక్యా వీరన్న 2023 జూన్18న ఎస్ఎస్‌వీ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఓసంస్థను స్థాపించాడు. తన సంస్థలో డిపాజిట్ చేస్తే, డిపాజిట్ చేసిన 200 రోజుల్లోనే డబుల్ ఇస్తానని నమ్మబలుకుతూ పెద్ద ఎత్తున ప్రచారం చేసాడు. డిపాజిట్ చేసిన రోజు నుంచి కట్టిన సొమ్మును బట్టి ప్రతి రోజూ వారి ఖాతాల్లో డబ్బులు పడతాయని నమ్మించాడు. రూ.1,000 కడితే రోజుకురూ.10, రూ.5వేలు కడితే రూ.50, రూ.లక్షకు రోజుకు రూ.1000 ఖాతాల్లో వేస్తామని(శని,ఆదివారాలు మినహా) ప్రచారం చేసాడు. తొలుత చేరిన కొంత మందికి వేసాడు.

దీంతో నమ్మిన జనం పెద్ద సంఖ్యలో సభ్యులుగా చేరారు. అందుకు కొంత మందిని ఎం.డీలంటూ చేర్చుకున్నాడు. ఇంకో ట్విస్టు ఏమిటంటే ఎలా ఇస్తారని ప్రశ్నించిన కొంత మందికి ముందుగా తానే డబ్బులు కట్టి కొద్ది రోజులు వారి ఖాతాల్లో డబ్బులు వేసేవాడు. దీంతో వారు ఆడబ్బులను వీరన్నకు చెల్లించేవారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన మానుకొండ రామారావును అలాగే ట్రాప్ చేసాడని సమాచారం. అంతేగాకుండా చిట్టీలు సైతం నడిపాడని, చిట్టీలు పాడుకున్న వారికి డబ్బులివ్వకుండా తన కంపెనీలో డిపాజిట్ చేయించేవాడని పేరు చెప్పటానికి ఇష్టపడని ఓబాధితుడు తెలిపాడు. ఇలా రకరకాలుగా ఎన్ని రకాలుగా జనాలను మోసం చేయొచ్చో అన్ని విధాలుగా మోసం చేసాడు.. చివరకు పోలీసులకు చిక్కాడు.

పోలీసులకు చిక్కినా లెక్క తేలలేదు...

రామారావు ఫిర్యాదుతో వీరన్న, అతనికి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి విచారించినా కేవలం రూ.9.58కోట్లుమాత్రమే డిపాజిట్లు సేకరించినట్లు తెలిపినట్లు పోలీసులు తెలిపారు. కాకపోతే ఇంకా దర్యాప్తు చేయాల్సింది ఉందన్నారు. పెద్ద మొత్తంలో డిపాజిట్లు సేకరించాడని, పెద్ద సంఖ్యలో సభ్యులున్నారని ప్రచారంలో ఉన్నప్పటికీ, అసలు నిజాలు రాలేదని అంటున్నారు.

'రైతుబంధు'లో మార్పుల కోసం...

» నేటి నుంచి జూలై 5 వరకు సదస్సులు

» రైతులు పాల్గొనేలా చూడాలని డీసీవో ఆదేశం

వైరా, జూన్ 28: రాష్ట్రంలో రైతుబంధులో చేపట్టనున్న సంస్కరణల కోసం రైతుల నుంచి అవసరమైన సలహాలు తీసుకొనేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దానిలో భాగంగానే శనివారం నుంచి వచ్చేనెల ఐదోతేదీ వరకు ఖమ్మం జిల్లాలోని విశాల, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యంలో రైతు సదస్సులు నిర్వహించతలపెట్టారు. ఖమ్మం జిల్లాలో ఉన్న 76 విశాల, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల వారీగా ఈ సదస్సులు నిర్వహించేందుకు జిల్లా సహకారశాఖ అధికారి ఆదేశాలు జారీచేశారు. ఒక్కోరోజుకు 12 సహకార సంఘాల పరిధిలో ఈ రైతు సదస్సులు నిర్వహించనున్నారు. ఒక్క ఐదో తేదీ మాత్రమే నాలుగు సహకార సంఘాల్లో సదస్సులు జరుగనున్నాయి. జిల్లా సహకార శాఖ అధికారి ఆయా సహకార సంఘాలకు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. ప్రత్యేక జనరల్‌బాడీ మీటింగ్‌లను ఏర్పాటుచేసి ఆ మీటింగ్‌ల్లో రైతుబంధు పథకం గురించి రైతుల సలహాలు, సూచనలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సహకార సంఘాల అధ్యక్షులు, పాలకమండలి సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. హాజరైన సభ్యుల సంతకాలతోపాటు పలు సలహాలు, సూచనలు విధిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి రైతుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు వ్యవసాయ సీజన్లకు కలిపి ఎకరాకు రూ.పదివేల చొప్పున రైతుబంధు నిధులను చెల్లించింది. దాదాపు 72 లక్షల మంది రైతులకు రైతుబంధు కింద లబ్ధి చేకూరింది. ఈ రైతుబంధు అమలులో వేల కోట్ల రూపాయల దుర్వినియోగం జరిగిందని డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శించింది. తాము అధికారంలోకి వస్తే రెండు వ్యవసాయ సీజన్లలో ఎకరాకు రూ.15వేల చొప్పున రైతుబంధు పథకం సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రకటించిన విషయం తెలిసిందే.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత యాసంగి సీజన్‌కు సంబంధించి బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాల ప్రకారమే రైతులకు నిధులు చెల్లించింది. అయితే వర్షాకాలం సీజన్ నుంచి ఈ పథకంలో భారీ మార్పులు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతంలో వెంచర్లు, భవన సముదాయాలకు కూడా కోట్లాది రూపాయలను రైతుబంధు కింద చెల్లించారనే విమర్శలున్నాయి. నిధుల దుర్వినియోగాన్ని నియంత్రించి సాగుచేసే రైతులకు ఎంత విస్తీర్ణం మేరకు రైతుబంధు నిధులివ్వాలనే దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పుడు వానాకాలం వ్యవసాయ సీజన్ మొదలైన తరుణంలో రైతుబంధు విధివిధానాల రూపకల్పన కోసం రైతుల నుంచి సలహాలు, సూచనల పేరిట సహకార సంఘాల ఆధ్వర్యంలో జనరల్‌బాడీ సమావేశాలను వారంరోజులపాటు నిర్వహించతలపెట్టారు. శనివారం వైరా విశాల సహకార పరపతి సంఘంలో కూడా ప్రత్యేక జనరల్‌బాడీ మీటింగ్ నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది విస్తృతంగా రైతుల్లో ప్రచారం చేస్తున్నారు.

సీతారామ ప్రాజెక్ట్ ఘనత కేసీఆర్‌దే

» స్థానికంగా నీళ్లు ఇచ్చిన తర్వాతే బయటకు తరలించాలి

» పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

అశ్వాపురం, జూన్ 28: సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణ ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని, ప్రాజెక్ట్ ద్వారా అశ్వాపురం మండలంలోని చెరువులకు సాగునీరు అందించిన తర్వాతనే బయటప్రాంతానికి గోదావరి జలాలను తరలించాలని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజీ కొత్తూరు పంప్‌హౌస్ వద్ద శుక్రవారం కేసీఆర్ చిత్రపటానికి రేగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీతారామ ప్రాజెక్ట్‌కు సంబంధించి 90 శాతం పనులు పూర్తికాగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు పెండింగ్ పనులు పూర్తి చేయకుండానే ట్రయల్‌రన్ నిర్వహించి అది తమఘనతగా చెప్పుకోవటం విడ్డూరంగా ఉందన్నారు.

పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం, కొత్తగూడెం నియోజక వర్గాలకు చుక్కనీరు అందించకుండా, ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు తరలించేందుకు మంత్రులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

ముందుగా ప్రాజెక్ట్ నిర్మిత ప్రాంతమైన అశ్వాపురం మండలంలోని చెరువులను నింపేందుకు ఏర్పాటు చేసిన మారెళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. స్థానికంగా నీళ్ల ఇవ్వకుండా ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మణుగూరు, అశ్వాపురం జడ్పీటీసీలు పోశం నర్సింహారావు, సూదిరెడ్డి సులక్షణ, అశ్వాపురం మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోడి అమరేందర్, నాయకులు మర్రి మల్లారెడ్డి, మేడవరపు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కృషితోనే సీతారామ నిర్మాణం

» ఎమ్మెల్సీ తాతామధుసూదన్

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 28: సీతారామ సాగునీటి ప్రాజెక్టు బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే నిర్మించడం జరిగిందని, ఆ ఘనత బీఆర్ఎస్‌ది, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధు పేర్కొన్నారు. ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ సంకల్పంతోనే సీతారామ ప్రాజెక్టు రీడిజైన్ ద్వారా మంజూరుచేసి నిధులు నటాయించడం ద్వారా నిర్మాణం జరిగిందని, రీడిజైన్ చేశారని కేసీఆర్‌పై అనేక విమర్శలు చేశారని తెలిపారు. సీతారామప్రాజెక్టు ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు 2016 ఫిబ్రవరి 16న బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, రూ.17వేల కోట్లతో 10లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు పనులు ప్రారంభించి జీవో నెంబరు 72 ద్వారా రూ.7926 కోట్లు మంజూరుచేశారని, ఉమ్మడి ఖమ్మంజిల్లాతోపాటు మహబాద్ జిల్లాకు కూడా సీతారామ ద్వారా నీరందుతుందని,తెలిపారు.

బీజీ కొత్తూరు ఎత్తిపోతల పథకంనుంచి ట్రయల్ రన్ విజయవంతం కావడం ద్వారా కేసీఆర్ సంకల్పం నెరవేరిందని, ఇందుక బీఆర్ఎస్ నుంచి హర్షం వ్యక్తంచేస్తున్నామని తెలిపారు. సీతారామ ప్రాజెక్టుపై గతంలో అనేక విమర్శలు చేశారనరి, వేలకోట్ల అవినీతి జరిగిందని, కాంగ్రెస్ మంత్రులు విమర్శలు చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ ఘనతగా చెప్పుకుంటున్నారని తెలిపారు. ఈవిలేకుల సమావేశంలో డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషణం, తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పల వెంకటరమణ, రూరల్ అధ్యక్షుడు బెల్లం వేణు, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, లీగల్‌సెల్ అధ్యక్షుడు తిరుమలరావు, నాయకులు బొమ్మరరామ్మూర్తి,, సతీష్, సుబ్బారావు పాల్గొన్నారు.

మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

» మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మంకార్పొరేషన్, జూన్28: సీతారామ ప్రాజెక్టు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితోనే సాధ్యమైందని ట్రయల్‌రన్ విజయవంతం కావడం పట్ల మాజీఎంపీ నామా నాగేశ్వరరావు హర్షం వ్యక్తంచేశారు. మాజీ సీఎం కేసీఆర్ అద్భుత ప్రయత్నంగా ఖమ్మంజిల్లాకు నిధులు కేటాయించి బీఆర్ఎస్ ప్రభుత్వంలో పూర్తిచేశారని, తద్వారా ఖమ్మంజిల్లాలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుబోతుందని ఈప్రాజెక్టు జిల్లా రైతులకు ఎంతో ఉపయోగమని, శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ట్రయల్‌రన్ సక్సెస్‌లో పాల్గొన్న అధికారులకు నామా కృతజ్ఞతలు తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగు హబ్‌గా తెలంగాణ

» అశ్వారావుపేటలో హార్టికల్చర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేట రూరల్, జూన్ 28: దేశంలో పామాయిల్ సాగులో తెలంగాణ రాష్ట్రం మార్గదర్శకంగా ఉండేలా ఆయిల్‌పామ్ సాగు విస్తరణ చేపడుతున్నట్లు, వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగయ్యేలా చర్యలు తీసుకుంటునట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అశ్వారావుపేటలోని పామాయిల్ పరిశ్రమను శుక్రవారం ఆయిల్‌ఫెడ్ ఎండీ, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ యాస్మిన్ బాషా, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి తుమ్మల సందర్శించారు. పరిశ్రమ వద్ద నూతనంగా నిర్మిస్తున్న 2.5 మెగావాట్ల పవర్ ప్లాంటు పనులను పరిశీలించారు. జూలై నెలాఖరులోగా పనులు పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశంలో 100లక్షల టన్నుల పామాయిల్ అవసరం కాగా, ప్రస్తుతం 3.96 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోందని తెలిపారు. ప్రస్తుతం దేశంలో 11లక్షల ఎకరాల్లో పామాయిల్ పంట పండుతోందని, అందులో తెలంగాణాలో రెండు లక్షల ఎకరాలు ఉందన్నారు. నికర ఆదాయం ఇచ్చే పామాయిల్ సాగును మరింతగా విస్తరింపజేసి దేశానికి తెలంగాణ హబ్‌గా ఉండేలా చేస్తామన్నారు.

పామాయిల్ సాగుచేసే రైతులకు రాయితీపై మొక్కలు, ఎరువులు ఇస్తూ పండిన పంటల రవాణా ఖర్చులు కూడా భరిస్తూ అన్నదాత అభివృద్ధి చెందేలా చూస్తున్నామన్నారు. ఇతర పంటలన్నింటి కంటే మంచి లాభాలు పామాయిల్ ద్వారా వస్తున్నాయని తెలిపారు. హైబ్రిడ్, పొట్టి రకాల వల్ల రైతులకు సాగులో ఇబ్బందులు ఉండవని తెలిపారు. పామాయిల్ గెలల ధర టన్నుకు కనీసం రూ.15 వేలు తగ్గకుండా ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారని, ఇప్పటికే ఈ ధర తగ్గకుండా చూడాలని కేంద్రాన్ని డిమాండ్ చేయటం జరిగిందన్నారు.

అప్పారావుపేట బెంచ్‌మార్క్ కావాలి

పామాయిల్ ధర నిర్ణయం విషయంలో కొత్తగూడెం జిల్లాలో ఉన్న రెండు ఫ్యాక్టరీల్లో ఒకటైన అప్పారావుపేట పరిశ్రమ ఆయిల్ రికవరీ (ఓఆర్)ని పరిగణలోకి తీసుకోవాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. గతంలో ఆంధ్రాలోని పరిశ్రమ ఓఆర్‌ను పరిగణనలోకి తీసుకుని రేటును నిర్ణయిస్తే తాను సంతకం కూడా చేయలేదన్నారు. అప్పారావుపేట, అశ్వారావుపేట పరిశ్రమల్లో ఆధునాతన యంత్రాలను వాడుతున్నామని, ఆయిల్ రికవరీ అధికంగా ఉందని, ఈ నేపథ్యంలో రైతుకు లాభం చేకూరేలా అప్పారావుపేట ఫ్యాక్టరీ ఓఆర్‌ను బెంచ్‌మార్క్‌గా తీసుకుని రేటును నిర్ణయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సత్తుపల్లి, వేంసూరు ప్రాంతాల్లో సాగు అధికంగా ఉన్నందున ఆ ప్రాంతంలోనూ మరో పరిశ్రమ ఏర్పాటుకు ప్లాన్ చేస్తున్నట్లు వివరించారు.

పామాయిల్ తోటల్లో గతంలో వేసిన కరెంటు లైన్ల వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నందున లైన్లు మార్చుకునేలా వెసులుబాటు కల్పించాలని రైతులు కోరుతున్నారని, దీనిపై విద్యుత్ శాఖ మంత్రి ద్వారా అధికారులకు తగిన ఆదేశాలు ఇప్పించి షిఫ్టింగ్ చార్జీలు లేకుండా లైన్లు మార్చుకునే అవకాశాన్ని కల్పించటం జరుగుతుందన్నారు. అశ్వారావుపేటలోని వెంకమ్మ చెరువుకు సీతారామ ద్వారా గోదావరి జలాలు తీసుకువచ్చి రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తానన్నారు.

ఉప ఉత్పత్తుల ఆదాయం రైతులకు అందాలి...

దమ్మపేట, జూన్ 28: ఉప ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయం రైతులకు అందేలా చూడాలని మంత్రి తుమ్మల ఆయిల్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఉద్యానవన శాఖ డైరెక్టర్, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషాతో కలిసి దమ్మపేట మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని మంత్రి శుక్రవారం సందర్శించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మేనేజింగ్ డైరెక్టర్ యాస్మిన్ బాషాకు ఫ్యాక్టరీ నిర్మాణం, ప్రాసెసింగ్, ఉప ఉత్పత్తుల వివరాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఆయిల్‌పామ్ రైతులు నష్టాల బారిన పడకుండా చర్యలు తీసుకోవటంతోపాటు, ఆయిల్ రికవరీలో ఆయిల్ నష్టపోకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, పామాయిల్ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్, ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఫ్యాక్టరీస్ మేనేజర్ శ్రీకాంతరెడ్డి, డివిజనల్ మేనేజర్ బాలకృష్ణ, అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు రమణ, సూర్యనారాయణ, ఏడిఎ అఫ్జల్‌బేగం, ఎంపీపీ సోయం ప్రసాద్, పలు శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



ఫ్యాక్టరీ వివరాలను ఎండీకి వివరిస్తున్న ఆయిల్‌ఫెడ్ అధికారులు

దేశంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు

» మతోన్మాదులకు గుణపాఠం చెప్పిన ఎన్నికల ఫలితాలు


» బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపవేయాలి

» పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యచరణ జరగాలి

» సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

» నగరంలో మొదలైన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 28: బీజేపీ ప్రభుత్వ పరిపాలనలో దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని, అతి కొద్ది మంది చేతుల్లో దేశ సంపద పోగు చేయబడుతోందని సీపీఐ జాతీయ సమితి కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. భవిష్యత్‌లో భారత ఆర్థిక వ్యవస్థ కొందరి గుప్పెట్లో చేరడం ద్వారా ఆర్థికంగా దేశం ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకునే పోరాటంలో కాంగ్రెస్ పార్టీ ముందుండాలన్నారు.



ఖమ్మంలో శుక్రవారం ప్రారంభమైన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో నారాయణ ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. కార్పొరేట్ శక్తులు, మోదీ అనుకూల సంస్థలు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొడుతుంటే మరో పక్క పేదలు మరింత పేదలుగా అవుతున్నారని ఆరోపించారు. ప్రపంచంలో పేదరిక గణనీయంగా పెరుగుతున్న దేశాల్లో భారతదేశం కూడా ముందుందన్నారు. ఆదేశ ఆర్థిక వ్యవస్థ ఒక కుదుపుకు గురవుతుంటే ప్రధాని మోదీ మాత్రం అబద్ధాలు చెబుతూ దేశం ఆర్థికంగా వెలిగిపోతుందని చంకలు గుద్దుకుంటున్నారని వాస్తవ పరిస్థితులు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. అయోధ్య రామాలయం చూపి దేశ వ్యాప్తంగా ఓట్లు దండుకుందామని చూస్తే చివరకు అయోధ్యలోనే బీజేపీ ఓటమి చూసిందని విమర్శించారు. లోక్‌సభలో బలమైన ప్రతిపక్షం ఉండటాన్ని సీపీఐ స్వాగతిస్తున్నదన్నారు. కేంద్రాన్ని నిలువరించి బొగ్గు బావుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, బొగ్గు బ్లాకుల వేలంపాటను తక్షణం నిలుపుదల చయాలని నారాయణ డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో సమస్యల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు రైతుబంధు, రుణమాఫీతో పాటు ఇతర ప్రజాసమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. పార్టీని గ్రామశాఖల్లో బలోపేతం చేసేందుకు కార్యచరణ రూపొందించాలని కోరారు. సీపీఐ జిల్లా కమిటి కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నివేదికను ప్రవేశపెట్టారు. జాతీయ కార్యదర్శి అజీజాపాషా, చాడా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో ఇన్ని తప్పులా...?



ఆళ్లపల్లిలో ఓపెన్‌ఫోరం నిర్వహిస్తున్న అధికారులు

ఆళ్లపల్లి, జూన్ 28: ఆళ్లపల్లి మండలంలో ఉపాధిహామి పనుల్లో జరిగిన తప్పులు, అక్రమాలు జిల్లాలో ఏ మండలంలో చూడలేదని పీఆర్‌డీఏ అడిషనల్ పీడీ రవి అన్నారు. గత వారం రోజులుగా గ్రామ పంచాయితీల్లో ఉపాధిహామి పనులపై ఎస్ఆర్‌బీ చెన్నకేశావులు, ఎస్‌టీయం సాయిఅనంద్ బృందంతో సామాజిక తనీఖీ నిర్వహించారు. శుక్రవారం ఎంపీపీ కొంద్రు మంజుభార్గవి, జడ్పీటీసీ సభ్యుడు కొమరం హనుమంతరావు సమక్షంలో అడిషనల్ పీడీ రవి ఆధ్వర్యంలో ఓపెన్‌ఫోరం నిర్వహించారు. ఈ ఓపెన్ ఫోరంలో అనేక అక్రమాలు,అవకతవకలు నిధుల దుర్వినియోగం జరిగినట్లు నిరూపించారు. అక్రమాలకు పాల్పడిన అధికారులను రికవరీ చేయించి, షోకాజ్ నోటీసులతో పాటు అవసరమైతే సస్పెండ్ కుడా చేస్తామని ఏపీడీ వెల్లడించారు. ఇప్పటి వరకు జరిగిన ఆడిట్‌లో రికవరీ, ఇతర అక్రమాలపై మరోసారి తనిఖీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక తనీఖీ అధికారి అనూష, విజిలెన్స్ వింగ్ అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

నెంబర్ ప్లేట్ లేకుండా
వాహనాలు నడిపితే కేసులు: సీపీ


పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, జూన్28: ఉద్దేశపూర్వకంగా నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే ఐపీసీ-420 కింద కేసు నమోదుచేస్తామని పోలీస్ కమిషనర్ సునిల్‌దత్ తెలిపారు. నగరంలోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం సీపీ సందర్శించి నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతు పట్టుబడిన 45మంది ద్విచక్రవాహనదారులతో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇటీవల కాలంలో చైన్‌స్నాచింగ్ , దొంగతనాలు చేసే నిందితులు పోలీసుల నుంచి సీసీ కెమెరాల నుంచి తప్పించుకునేందుకు ద్విచక్రవాహనాల నెంబరు ప్లేట్లను తొలిగిస్తున్నారన్నారు. అదేవిధంగా చోరీ చేసిన వాహనాలతోనే ఎక్కువగా నేరాలు చేస్తున్నారన్నారు. దొంగిలించిన వాహనాలకు నకిలీ పత్రాలు సృష్టించి తక్కువ ధరకు విక్రయిస్తారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఎవరైనా వాహనాలు, కొనుగోలు, అమ్మకాలు చేసినట్లయితే ఖచ్చితంగా రిజిస్ట్రేషన్ మార్చుకోవాలని సూచించారు. లేదంటే ఏదైనా నేరాల్లో మీ వాహనాలు ఉన్నట్టు గుర్తిస్తే సమస్య ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించేందుకు జరిమానా తప్పించుకునేందకు నెంబరు ప్లేటు తొలిగించినా, వంచినా, వారిని గుర్తించి వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని ట్రాఫిక్ పోలీసులను సీపీ ఆదేశించారు. ప్రస్తుతం నెంబర్ ప్లేట్ లేకుండా పట్టుబడిన వాహనపత్రాలు, చాయిస్ నెంబర్లు తనిఖీ చేయాలని అన్నారు. అదేవిధంగా మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్‌పై మరంత దృష్టిపెట్టాలని, మైనర్లకు వాహనాలు ఇచ్చినా ఎంవీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈసెక్షన్ కింద నేరం రుజువైతే జైలు శిక్ష లేదా జరిమానా తప్పదన్నారు. ఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ మోహన్‌బాబు, ఎస్ఐలు రవి, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

● జిల్లా అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్


ఉద్యోగ నియామకపు పత్రాలు అందిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

కూసుమంచి, జూన్ 28ఐ జాబ్‌మేళా ద్వారా నిరుద్యోగ యువతకు సులభంగా ఉద్యోగాలు పొందవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూధన్ నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పాలేరులోని బీవీ. రెడ్డి ఫంక్షన్ హాల్ నందు తెలంగాణ యువజన సర్వీసుల శాఖ, టీజీఎస్‌టీఈపీ-హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడారు. వేలాదిమంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు వివిధ కంపెనీలు మెగా జాబ్‌మేళాను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్, వరంగల్‌తోసాటు వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన 65 కంపెనీలు 5వేల ఉద్యోగాలు కల్పించేందుకు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం జాబ్‌మేళాలో ఉద్యోగం పొందినవారికి నియామకపు పత్రాలు అందించారు.

571 మందికి నియామక పత్రాల అందజేత

మెగాజాబ్ మేళాకు 2014 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వివిధ కంపెనీలకు 571 మంది యువత ఎంపికై నియామకపు పత్రాలు పొందారని తెలిపారు. మరో 1,043 మంది ఇంటర్వ్యూకు అర్హత పొందారని తెలిపారు. ఈసందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్, జిల్లా యువజనసర్వీసుల శాఖ అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, జిల్లా పౌరసంబంధాల అధికారి గౌస్, ఎంపీపీ బాణోతు శ్రీనివాస్, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, సీఐ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా రద్దు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్28: కొత్తగూడెం క్లబ్ వేదికగా శనివారం నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను రద్దు చేస్తూ, జూలై 1వ తేదీన నిర్వహిస్తున్నామని భద్రాద్రి జిల్లా డీవైఎస్‌వో కె.సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ జాబ్ మేళాలలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జూలై 1వ తేదీ సోమవారం నిరుద్యోగులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రవాణాశాఖ పెన్ డౌన్

» హైదరాబాద్ సంఘటనపై నిరసన తెలిపిన అధికారులు, ఉద్యోగులు

» ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా సేవలు బంద్


డీటీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న డీటీవో, ఉద్యోగులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 28: హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రమేష్‌పై ఆటో రిక్షా యూనియన్ నాయకులు భౌతికంగా దాడి చేశారని ఆరోపిస్తూ శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రవాణాశాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టారు. నల్లబ్యాడ్జీలను ధరించి నిరసనలో పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా రవాణాశాఖ అధికారి అఫ్రీన్‌సిద్ధిఖి ప్రధాన గేటు ఎదుట నిలబడి నిరసన తెలిపారు. ముందుకు స్లాట్ బుక్ చేసుకున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడో!?

» దూరమవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు

» ఆందోళనలో సామాన్యులు

» ఏళ్లుగా నిరీక్షిస్తున్న లక్షకు పైగా అర్హులు


రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటున్న ప్రజలు (ఫైల్)

మధిర, జూన్ 28: అర్హత ఉన్నా తెల్లరేషన్ కార్డులు రాక జనం పరేషాన్ అవుతున్నారు. ఏళ్ల తరబడి రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత రెండుమార్లు మాత్రమే కొత్త రేషన్ కార్డులు ఇచ్చారు. అది కూడా ఉప ఎన్నికలు జరిగిన సందర్భాలలో అరకొరగా కొన్ని ప్రాంతాలకు ఇచ్చి మమ అనిపించారు. ఆ తర్వాత రేషన్ కార్డుల ఊసే లేదు. ప్రజలు దరఖాస్తులు చేసుకొనే అవకాశం కూడా లేకుండా వెబ్‌సైట్‌ను సైతం నిలిపివేశారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా నిర్దేశించడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

ప్రజల ఎదురుచూపులు

తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక 2015లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. వేలాదిగా దరఖాస్తులొస్తే వందలాది మందికి మాత్రమే కార్డులు ఇచ్చారు. 2021లో మరోసారి రేషన్ కార్డుల పంపిణీ అని ప్రచారం చేసినా అరకొరగానే ఇచ్చారు. ప్రభుత్వం కార్డులు ఇస్తామని ప్రకటించినప్పుడల్లా ప్రజల్లో ఆశలు చిగురించేవి. తీరా విచారణల పేరుతో కాలం వెల్లదీస్తూవచ్చారు. అందరికీ రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో అందని ద్రాక్షపండులాగే పరిస్థితి మారింది. రాష్ట్రం లో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు అర్హులందరికీ ఇస్తామని ఎన్నికల వాగ్దానం చేసింది. అందుకు అనుగుణంగా ప్రజాపాలనలో ఆరు పథకాలకే అవకాశం ఇచ్చినా, ఆ దరఖాస్తులతో పాటు కొంతమంది రేషన్ కార్డు ల కోసం దరఖాస్తు చేశారు. వీటిపై ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

> **ఖమ్మంజిల్లాలో**
>
> **4,11,251 తెల్ల రేషన్‌కార్డులు**
>
> ఖమ్మం జిల్లాలో ఇప్పటికే కుటుంబ ఆహార భద్రతా కార్డులు (తెల్లరేషన్ కార్డులు) 4,11,251 ఉన్నాయి. వీటిలో ఏఎఫ్ఎస్‌సీ కార్డులు 26,829 ఉంటే ఎఫ్ఎస్‌సీ కార్డులు 3,84,419 ఉన్నాయి. వీటిద్వారా ప్రతి నెల 7,279 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పంపిణీ జరుగుతోంది. మధిర నియోజకవర్గంలో 86,030 కార్డులు ఉన్నాయి. వీటిలో ఏఎఫ్ఎస్‌సీ కార్డులు 5,774 ఉంటే ఎఫ్ఎస్‌సీ కార్డులు 80,256 ఉన్నాయి. కొత్తగా రేషన్ కార్డులు కోసం మధిర నియోజకవర్గంలో 25వేల మంది వరకు దరఖాస్తులు చేసుకొని, కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.

పథకాలు అందని పరిస్థితి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను ఒక్కొటి అమలు చేస్తోంది. అందుకు రేషన్ కార్డులనే ప్రామాణికంగా తీసుకోవడంతో ఎంతో మంది పేదలు తెల్లరేషన్ కార్డులేక ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నారు. ఇప్పటికే గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంట్ సదుపాయం పొందాలంటే రేషన్ కార్డుల కావాలంటున్నారు. 500 రూపాయల గ్యాస్ పథకం వర్తించాలంటే కూడా రేషన్‌కార్డు కావాలని గ్యాస్ కంపెనీలు చెబుతున్నాయి.

కొత్తగా ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసేందుకు తెల్లరేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకోవాలనే సూచనలు అధికారుల నుంచి వెళ్తున్నాయి. దీనిపై ప్రభుత్వం నిర్ణయం ఎలా ఉంటుందోననే ఆందోళన చిన్న, సన్నకారు రైతుల్లో వ్యక్తమవుతోంది. తెల్లరేషన్‌కార్డు ఉన్న మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని ఓ మంత్రి ప్రకటించారు. అంతే కాకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన పేదల ఇళ్లను రద్దు చేసి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని కొత్త ప్రభుత్వం సూచించింది. ఇప్పుడు పేదలకు ఇళ్ల, ఇంటి స్థలం ఇవ్వాలంటే కూడా తెల్లరేషన్ కార్డు కావాలి. ఇలాప్రతి ప్రభుత్వ పథకానికి తెల్లరేషన్ కార్డుతో లింక్ పెడుతుండటంతో కార్డు లేని వారు ఆందోళన చెందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో తెల్లరేషన్‌కార్డులు పొందేందుకు లక్షమందికి పైగా అర్హులున్నారని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. గత ప్రజాపాలనలో ఆరు పథకాలకే దరఖాస్తులు స్వీకరించారు. అందులో రేషన్ కార్డుల కోసం దరకాస్తులు కోరలేదు. అయినా చాలా మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేశారు. గతంలో పలు దఫాలుగా వచ్చిన దరఖాస్తులు, ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల్లో లక్షమంది వరకు అర్హులు ఉంటారని సమాచారం. ఇది కాకుండా కొత్తగా దరఖాస్తులకు అవకాశం వస్తే వాటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ఎలాంటి ఆదేశాలు రాలేదు...

● వి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, మధిర

కొత్తరేషన్ కార్డుల మంజూరు విషయంలో ప్రభుత్వం నుంచి ఇంత వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే విచారణ జరిపి కొత్త కార్డుల మంజూరు చేస్తాం. పాత కార్డుల్లో చేర్పులు, మార్పులు చేపడతాం. అర్హులందరికీ కొత్తకార్డులు ఇస్తాం.

జక్కంపూడిని పరామర్శించిన మంత్రి తుమ్మల


జక్కంపూడి కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల

తల్లాడ, జూన్ 28: తల్లాడ మండలంలో శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. మండలంలోని బిల్లుపాడు గ్రామంలో అనారోగ్యానికి గురైన సొసైటీ మాజీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తిని తుమ్మల పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని కృష్ణమూర్తి కుమారులు కిషోర్, రాములును అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిం చారు. అనంతరం తల్లాడలో రాయల నర్సింహారావు గృహాన్ని సందర్శించి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయిని సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేసిన తుమ్మలకు పలువురు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు దగ్గుల రఘుపతిరెడ్డి, కొమ్మినేని ప్రభాకర్‌రావు, నాయకులు దుండేటి వీరారెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, సరికొండ అప్పలరాజు, అనుమోలు బుద్దీసాగర్, సామినేని రామ అప్పారావు, రాయల రాము, వేమిశెట్టి నాగన్న, కేతేపల్లి బాస్కర్‌రావు, మారెళ్ల మల్లిఖార్జున్‌రావు, మూకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభాద్రి ఆస్పత్రి ప్రారంభం రేపు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 28: ఖమ్మం నగరంలో మరో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి స్తంభాద్రి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని ఆదివారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిరుపేద ప్రజలకు వైద్య సేవలను అందించాలన్న లక్ష్యంతో డాక్టర్లే మేనేజ్‌మెంట్‌గా ఈ ఆస్పత్రిని నిర్వహిస్తోన్నట్లు చెప్పారు. న్యూరో, ట్రామాకేర్, ఆర్థోపెడిక్, గుండె సంబంధిత, యూరాలజీ క్రిటికల్ కేర్ విభాగాల్లో అత్యాధునిక వైద్య సదుపాయలతో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, తాతా మధు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలతి పాల్గొంటారని తెలిపారు.

వృద్ధురాలిని కాపాడిన బ్లూ కోట్స్ పోలీసులు

భద్రాచలం, జూన్ 28: భద్రాచలంలోని గోదావరి నది స్నానఘట్టాల వద్ద గోదావరి లో దిగి శుక్రవారం ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధురాలిని బ్లూ కోట్స్ పోలీసులు కాపాడారు. కొత్తగూడెంలోని రామవరం కాలనీకి చెందిన భారతి అనే వృద్ధురాలు తనకు కడుపునొప్పి ఉందని, తన పిల్లలను ఇబ్బంది పెట్టలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపింది. వృద్ధురాలిని కాపాడి ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లూ కోట్స్ పోలీసులు సురేంద్ర, జంపయ్య చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

దాతల సహకారంతో
సకల హంగులు

» ఆకట్టుకుంటున్న అన్నారుగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల

» ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయుల కృషి

» బృందావనాన్ని తలపిస్తున్న పాఠశాల ప్రాంగణం


అన్నారుగూడెం పాఠశాలలో ఏపుగా పెరిగిన చెట్లు


దాతలు నిర్మించిన కళావేదిక

తల్లాడ, జూన్ 28: అది ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాల.. అక్కడి ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాలేదు. పాఠశాలకు అవసరమైన మౌళిక సౌకర్యాలు మెరుగుపర్చడంపై దృష్టి సారించారు. ప్రజల భాగస్వామ్యంతో దాతలను సమీకరించారు. అన్ని హంగులతో పాఠశాలను అభివృద్ధి చేశారు. పచ్చదనంతో పాఠశాల ప్రాంగణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. ఇది తల్లాడ మండలం అన్నారుగూడెంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రత్యేకత.

పాఠశాలలో మౌళిక సౌకర్యాల కల్పనకు 12 ఏళ్లకుపైగా పనిచేసిన ఉపాధ్యాయులు కృషిచేశారు. వీరిలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మాదినేని నర్సింహారావు కృషి ప్రశంసనీయం. దాతృత్వ సంస్థలు, వ్యక్తులను తరచూ కలిసి పాఠశాలలో మెరుగుపర్చాల్సిన మౌళిక సౌకర్యాల గురించి విన్నవించడంతో ముందుకొచ్చి సహాయసహకారాలు అందించారు. 2015 నుంచి రెండు విడతలుగా పాఠశాల ఆవరణంలో హరితహార కార్యక్రమంలో మొక్కలు నాటి వాటి సంరక్షణ కోసం చనిపోయిన వారి జ్ఞాపకార్థం ట్రీగార్డ్స్ ఏర్పాటు చేసి డ్రిప్ సిస్టమ్ ద్వారా నిత్యం నీటి సౌకర్యం కల్పించడం వల్ల నాటిన మొక్కలన్నీ వృక్షాలుగా వృద్ధిచెందాయి. 2016లో పాఠశాల పౌండేషన్ ఆధ్వర్యంలో వెంగన్నపేట(గూడూరు) గ్రామానికి చెందిన కల్యాణపు శ్రీనివాస్ రూ.50వేలతో పాఠశాలలో విద్యుదీకరణ చేశారు. ఖమ్మానికి చెందిన సుబంధా పౌండేషన్ 50శాతం నిధులు, గ్రామస్థులు మరో 50శాతం నిధులను వెచ్చించి పాఠశాలకు 70డ్యూయల్‌డెస్క్ బల్లలను అందజేశారు.


పాఠశాలలో ఉన్న అధునాతన సైన్స్ ల్యాబ్

2017లో ఎన్నారై పౌండేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ తరగతుల నిర్వహణ కోసం దొడ్డా లక్ష్మణ్‌రావు ఎల్ఈడీలను బహూకరించారు. 2018లో ఖమ్మం రోటరీక్లబ్, దొడ్డా రవి సహకారంతో రూ.60వేలతో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను నెలకొల్పారు. 2022లో జిల్లాలోనే ప్రయోగాత్మకంగా ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సర్పంచ్ మారెళ్ల మమత సహకారంతో రూ.6.50లక్షల నిధులతో పాఠశాలలో అధునాతన సైన్స్ ల్యాబ్‌ను నెలకొల్పారు. 2022లో దర్శకరత్న దాసరి నారాయణరావు, పద్మ దంపతుల జ్ఞాపకార్థం నీడా ట్రస్టు, దాసరి పద్మ స్మారక యువజన సాంస్కృతిక సమాఖ్యల ఆధ్వర్యంలో డాక్టర్ ఎం.రఘుబాబు, హేమాలయకుమారి, గొట్టిపాటి తాండవ కృష్ణలు అందించిన రూ.రెండులక్షల వ్యయంతో కళావేదిక నిర్మించారు.

ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి పాఠశాల ప్రాంగణంలో రూ.ఐదులక్షల నిధులతో సిమెంట్‌రోడ్డును నిర్మించారు. కోతుల బారీనుంచి రక్షణ కోసం 1983-84ఎస్ఎస్‌సీ పూర్వవిద్యార్థుల సహకారంతో రూ.60వేలతో ఇనుపగ్రిల్స్ నిర్మించారు. 2023లో ఎన్నారై వాసిరెడ్డి దయానంద్ సహకారంతో రూ.60వేలతో మధ్యాహ్నభోజన వంటశాల నిర్మించారు. ఇంగుర్తి శ్రీనివాసాచార్యులు సహకారంతో రూ.50వేలతో పాఠశాల ప్రధాన స్వాగత ద్వారాన్ని నిర్మించారు. 13ఏళ్లపాటు లయన్స్‌క్లబ్ సహకారంతో ఎస్ఎస్‌సీ విద్యార్థులకు అల్పాహార పంపిణీ జరిగింది.

పాఠశాలలో మౌళిక సౌకర్యాల కల్పనకు విశేష కృషి చేసిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు మాదినేని నర్సింహారావును రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వరించింది. పాఠశాలకు జిల్లాస్థాయి స్వచ్ఛ పాఠశాల పురస్కారం దక్కింది. అన్ని హంగులతో ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు 12ఏళ్లపాటు కృషి చేసి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు మాదినేని నర్సింహారావు, రాజకుమారి, సునీత, సుచరిత, కనకమ్మ, వీరన్నలను ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేసిన కృషిని ముక్తకంఠంతో కొనియాడారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన కరపత్రాలు

» మావోయిస్టు అరాచకాలకు బలి అవుతున్న అమాయక ఆదివాసీలు

» కాలం చెల్లిన సిద్ధాంతాలకు లోను కావద్దు : ఎస్ఐ రాజేందర్


కరకగూడెంలో వెలిసిన మావోయిస్టుల వ్యతిరేక కరపత్రాలు

కరకగూడెం, జూన్ 28: మండలంలోని కరకగూడెం రంగాపురం వెల్లె మోతె పరిధిలోని ఎర్ర చెరువు ప్రధాన రహదారి వద్ద 'మావోయిస్టు అరాచకాలకు బలి అవుతున్న అమాయక ఆదివాసీలు' అని మావోయిస్టులకు వ్యతిరేకంగా శుక్రవారం కరపత్రాలు వెలిశాయి. బీజాపూర్ జిల్లాలోని మావోయిస్టు అమర్చిన ఐఈడీ పేలుడుతో నడపల్లి గ్రామానికి చెందిన జోగి అనే మహిళ(50) తీవ్ర గాయాలయ్యాయని.. ఆటవీ ఉత్పత్తులు సేకరించడానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగిందని పేర్కొన్నారు. జోగి ప్రమాదవశాత్తూ ఐఈడీపై కాలు పెట్టడంతో పేలుడు సంభవించడం వల్ల తీవ్రంగా గాయపడిందని ముద్రించారు. మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు సాధారణ ప్రజలను సైతం టార్గెట్ చేస్తూ, కాలి బాటల వెంట మందు పాతరలు అమర్చి వారి ప్రాణాలు బలిగొంటున్నారని.. మావోయిస్టులపై ఏదైనా జరిగినప్పుడు స్పందించే పౌర హక్కుల సంఘం నాయకులు సామాన్య ప్రజలకు అన్యాయం జరిగితే స్పందించడం లేదు ఎందుకు అని కరపత్రాలతో ముద్రించారు. పటేల్భార ముత్వెండి గ్రామం గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన 18 ఏళ్ల గడియ అనే యువకుడు అటవీ ఉత్పత్తుల కోసం అడవికి వెళ్లి తిరిగి వస్తుండగా మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ ఐఈడీ పేలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ దుహంకార దుశ్చర్యకు కారకులు మావోయిస్టులు కాదా.. ఆదివాసుల అండతో బతుకుతూ ఆదివాసులని బలి తీసుకుంటుంది ఎరవు.. గడియ కుటుంబాన్ని ఆంధకారం చేసింది ఎవరు.. మావోయిస్టు చనిపోతే రాదంతం చేసే ప్రజా సంఘాలు ఇప్పుడు మౌనం ఎందుకు.. అనే కరపత్రాలు మండలంలో వెలిశాయి. కరపత్రాలు వెలిసిన విషయంపై కరకగూడెం ఎస్ఐ రాజేందర్‌ను వివరణ కోరగా.. కరపత్రాలు వెలిసిన విషయం మా దృష్టికి వచ్చిందని, మావోయిస్టులు దుశ్చర్యాలకు పాల్పడటం సరికాదన్నారు. కాలం చెల్లిన సిద్ధాంతాలకు ప్రజలు లోను కావద్దన్నారు. మండలంలో కొత్త వ్యక్తులు అనుమానితులుగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

నువ్వేం చేసుకుంటావో !..చేసుకో పో!

» సినిమా హాల్లో మూత్రశాలల నిర్వహణ అధ్వానం

» కలెక్టర్, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసిన ప్రేక్షకుడు

భద్రాచలం జూన్ 28: సినిమా హాల్లో మూత్రశాలల నిర్వహణ చాలా అధ్వానంగా ఉందని హాల్ నిర్వాహకులకు ఓ ప్రేక్షకుడు ఫిర్యాదు చేయగా, నువ్వేం చేసుకుంటావో..చేసుకో పో అని నిర్లక్ష్యంగా ఆ ప్రేక్షకుడికి నిర్వాహకులు సమాధానమించిన ఘటన భద్రాచలంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. భద్రాచలంలోని ఓ సినిమా హాలులో ఇటీవల విడుదలైన సినిమాను తిలకించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ప్రేక్షకుడు పురుషోత్తమాచార్యులు వెళ్లగా, మూత్రశాలల నిర్వహణ అధ్వానంగా ఉందని గుర్తించి సినిమా హాలు నిర్వాహకుడితో చెప్పాడు. వారు నిర్లక్ష్యంగా, దురుసుగా సమాధానం ఇవ్వడంతో తాను మనస్తాపానికి గురైనట్లు పేర్కొన్నారు. అంతా అధ్వానంగా ఉంటే ప్రేక్షకులు ఎలా వెళ్తారు? ఈ విషయంపై నేను అధికారులకు ఫిర్యాదు చేస్తా అన్నా, నిర్లక్ష్యంతోనే సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో నువ్వేం చేస్తావో చేసుకో పో అని సదరు సినిమా హాలు నిర్వాహకుడు నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత సిని మా హాల్లో మూత్రశాలల నిర్వహణ తీరుకు సంబంధించిన వీడియోను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావులకు పంపిస్తూ లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు ప్రేక్షకుడు పురుషోత్తమాచార్యులు తెలిపారు. తమ కుటుంబ సభ్యులు శుక్రవారం రోజు రూ.1,200 వెచ్చించి సినిమాకి వెళ్లినట్లు పేర్కొన్నారు. ప్రేక్షకుల వద్ద భారీ మొత్తంలో టికెట్ ధర వసూలు చేస్తూ కనీస మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయని థియేటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని అధికారులకు చేసిన ఫిర్యాదులో ఆయన కోరారు.

కళాకారులను ప్రోత్సహించడం మనందరి బాధ్యత

● కాంగ్రెస్ నాయకుడు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు


కళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కొత్వాల

పాల్వంచ, జూన్ 28 : కళలను గుర్తించడం, కళాకారులను ప్రోత్సహించడం మనందరి బాధ్యతని కాంగ్రెస్ నాయకుడు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పాకాలపాటి కృష్ణయ్య సాంస్కృతిక కళాపీఠం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయస్థాయి నాటకోత్సవాలను శుక్రవారం కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని సీతారామకల్యాణ మండపంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉత్సవాల్లో భాగంగా నాటకాలను ప్రదర్శించిన కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో కొండం వెంకన్నగౌడ్, పాకాలపాటి రోశయ్య చౌదరి, ఎంపీడీవో విజయభాస్కరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎర్రంశెట్టి ముత్తయ్య, కాపర్తి వెంకటాచారి, సాధం రామకృష్ణ, నాయుడు, గంధం నరసింహారావు, పులి సత్యనారాయణ, శ్రీపాద సత్యనారాయణ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన దొంగ అరెస్ట్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్28: వాహన తనిఖీల్లో ద్విచక్రవాహన దొంగను అదుపులోకి తీసుకొని, అరెస్ట్ చేశామని కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ శుక్రవారం తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ వద్ద వన్‌టౌన్ ఎస్ఐ విజయ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఈ క్రమంలో పోలీసులను చూసి ద్విచక్రవాహనం నడుపుతున్న వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ వ్యక్తిని వెంబడించి పట్టుకున్నారని తెలిపారు. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా గుంటూరు జిల్లాకు చెందిన సల్లా చంద్రశేఖర్ చుంచుపల్లి మండలం హౌసింగ్‌బోర్డులో నివసిస్తూ పలు ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నాడని విచారణలో తెలిందన్నారు. గతంలో నిందితుడు చంద్రశేఖర్ మూడు ద్విచక్రవాహనాలను దొంగిలించినట్లు అంగీకరించాడని పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్ గని, కానిస్టేబుల్ సురేష్, వీరన్న, నరేష్, ప్రసాద్‌లను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

అదనపు కట్నం వేధింపులు.. భర్తకు జైలు

కొత్తగూడెం లీగల్, జూన్ 28: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసిన భర్తకు జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం మూడోవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వి. శివనాయక్ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాల ప్రకారం.. పాల్వంచకు చెందిన కాలం చైతన్యతో రుద్రంపూర్‌కు చెందిన కాలం సుధాకర్‌రావుతో 2023లో వావాహం జరిగింది. వివాహ సమయంలో కట్నంగా నగదు, బంగారం అతడికి అప్పగించారు. ఒక నెల వరకు ఇరువురు బాగానే ఉన్నా, తదనంతరం తన భర్త, అత్త లక్ష్మీకాంతమ్మ, ఆడబిడ్డ మోరే పద్మల ప్రోత్సాహంతో వేధించేవాడు. తన కుటుంబ సభ్యులని ఎవరిని కలవనించేవాడు కాదని, మద్యం సేవించి చంపుతానని బెదించేవాడు. తన తండ్రి 2011లో ఎస్సీ కంపెనీ నుంచి రిటైర్‌మెంట్‌గా వచ్చిన డబ్బులలో, అదనపు కట్నం తెమ్మని ఒత్తిడి చేశాడని, 2017 డిసెంబర్ 28న నన్ను, పిల్లల్ని చంపుతానని బెదిరించాడని పాల్వంచ టౌన్ పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డికి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో అతడిపై చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో సాక్షులను విచారించిన అనంతరం కాలం సుధాకర్‌రావుపై నేరం రుజువుకావడంతో అతడికి ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. తన అత్త లక్ష్మీకాంతమ్మ, ఆడబిడ్డ మోరే పద్మలపై నేరం రుజువు కాకపోవడంతో వారిపై ఉన్న కేసును కొట్టివేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో చోరీకి యత్నం

బూర్గంపాడు, జూన్ 28: బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో చోరీకి యత్నించిన ఘటన చోటుచేసుకుంది. తహసీల్దార్ కార్యాలయంలో పలువురు మహిళలు శుక్రవారం చోరీకి పాల్పడడం గమనించిన స్థానికులు వారిని పట్టుకునే ప్రయ త్నం చేశారు. దీంతో స్థానికులను గమనించిన దొంగలు వారి వద్ద ఉన్న వాటిని వదిలేసి పారిపోయినట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో వెనుక వైపున ఉన్న ఓ గదిలో నిరుపయోగంగా ఉన్న బ్యాటరీలను తీసుకెళ్లెందుకు ప్రయత్నించినట్లు డిప్యూటీ తహసీల్దార్ నరేష్ తెలిపారు. స్థానికుల రాకను గమనించిన దొంగలు 8బ్యాటరీలను వదిలేసి వెళ్లారన్నారు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఐదుగులు మహిళలు చోరీకి యత్నించినట్లు స్థానికులు తెలిపారు.

200 లీటర్ల డీజిల్ చోరీ

తిరుమలాయపాలెం, జూన్28: ఆగి ఉన్న లారీ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు 200 లీటర్ల డీజిల్‌ను దొంగతనం చేసిన సంఘటన మండలంలోని పిండిప్రోలులో పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీడ్రైవర్ పిండిప్రోలుసమీపంలో పెట్రోల్‌బంకు వద్ద లారీని ఆపాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు లారీ ట్యాంకర్‌లో ఉన్న సుమారు 200 లీటర్ల డీజిల్‌ను దొంగిలించారు. లారీ డ్రైవర్ జగన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గిరిధర్‌రెడ్డి తెలిపారు.


నాలుగు గంటలు నిలిచిన గూడ్స్ రైలు

● రామకృష్ణాపురంలో ఘటన

చింతకాని, జూన్ 28: మండల పరిధిలోని రామకృష్ణాపురం రైల్వే స్టేషన్ సమీపంలోని గేటు వద్ద శుక్రవారం గూడ్స్ రైలు నాలుగు గంటల పాటు నిలిచిపోయింది. గేటు వద్ద గూడ్స్ రైలు నిలవడంతో గేటు దాటి సమీప గ్రామాలకు వెళ్లాల్సిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం సమయం కావడంతో పాఠశాల బస్సులు గేటు వద్ద నిలిచిపోవడంతో విద్యార్థులు బాధ వర్ణణాతీతం. సాయంత్రం సమయమైన విద్యార్థులు ఇంటికి రాకపోవడంతో హైరానా పడిన వారి తల్లితండ్రులు సమాచారం తెలుసుకుని గేటు వద్దకు వచ్చి గూడ్స్ రైలు కింద నుంచి ట్రాక్ దాటి ఇంటికి తీసుకెళ్లారు. నాలుగు గంటలు నిలిచిన అనంతరం సాయంత్రం సమయంలో రైలు ముందుకు కదిలింది. మూడో రైల్వే లైన్ నిర్మాణ మరమ్మతుల సందర్భంగా నిత్యం రైళ్లు గేటు వద్ద నిలుపుతున్నారని, రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని గ్రామస్థులు రైల్వే అధికారులను కోరుతున్నారు.


ట్రైన్ కింద నుంచి ట్రాక్ దాటుతున్న విద్యార్థులు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
శనివారం 29 జూన్ 2024



చికిత్స పొందుతూ వివాహిత మృతి

పాల్వంచ, జూన్ 28: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పాల్వంచ పట్టణ పరిధిలోని రాంనగర్‌లో నివాసముంటున్న షహీన్ సుల్తానా బేగం గత 5 సంవత్సరాలుగా షుగర్ వ్యాధితో బాధపడుతుంది. ఈ మధ్య కాలంలో వ్యాధి మరింతగా బాధిస్తుండటంతో సోమవారం ఇంట్లోని ఫ్యానుకు చీరకొంగుతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కాపాడి ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు యాకూబ్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

లక్ష్యాన్ని సాధించే వరకూ ప్రయత్నం చేయాలి

విద్యార్థికి లాప్ టాప్ అందజేసిన పిఓ రాహుల్

నూతన పీవోని మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు

టెండర్ల ప్రక్రియలో పాల్గొన్న పీవో

భద్రాచలం జూన్ 28: ప్రతి విద్యార్థి చదువులలో ఆసక్తి చూపి అనుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు ప్రయత్నం చేస్తూనే ఉండాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఇల్లెందు మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన ధరావత్ రవికుమార్ గేట్ ప్రవేశ పరీక్షలో 8300 ర్యాంకు రావడంతో ఐఐటి బొంబాయిలో సీట్ సాధించారు. దీంతో ఆ విద్యార్థిని పీవో అభినందించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి ఎంటెక్ చదవడానికి బొంబాయి వెళుతున్నందున గిరిజన సంక్షేమ శాఖ తరపున ల్యాప్ టాప్‌ను అందించారు. ఎంటెక్ కోర్సులో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించి మంచి పేరు తేవాలని సూచించారు . విద్యార్థి రవికుమార్ పై చదువులు చదవడానికి గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఆర్థిక సాయం అందించడానికి కృషి చేస్తానని పీవో రాహుల్ అన్నారు. గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు రవికుమార్‌ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాల (బాలికలు) కొత్తగూడెంలో మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన పాయం ప్రవళిక సీపీటీ -ఎంబీఏ, కోర్సులో 66.44 శాతం సాధించి కలకత్తాలో సీటు సంపాదించినందుకు ల్యాప్ టాప్ బహుకరిస్తానని గతంలో పని చేసిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ హామీ ఇవ్వడంతో ఆ విద్యార్థినికి కొరియర్ ద్వారా ల్యాప్టాప్ అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్,గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు మణెమ్మ, విద్యార్థి తండ్రి గోపాల్ పాల్గొన్నారు.



లాప్‌టాప్ అందజేస్తున్న పీవో రాహుల్

పీవోను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు

భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన బి.రాహుల్‌ను భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారులు దామోదర్ రావు, మధుసూదన్, శుక్రవారం పీవో చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి ఆర్డీవోలతో గిరిజన గ్రామాలలో రెవెన్యూకు సంబంధించిన ఏమైనా భూ సమస్యలు గానీ, గిరిజనుల భూ సమస్యలు ఏమైనా ఉంటే గిరిజనులకు ఇబ్బందులు కలగకుండా తప్పనిసరిగా పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని ఆర్డీవోలకు సూచించారు. అలాగే ఇతర శాఖలు విభాగాలకు చెందిన అధికారులు సైతం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రాజెక్ట్ అధికారి రాహుల్ ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

టెండర్ ప్రక్రియలో పాల్గొన్న సీవె

2024-25 ఆర్థిక సంవత్సరంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు వంట సరుకులను సరఫరా చేసేందుకు నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో పీవో రాహుల్ పాల్గొన్నారు. నాణ్యతతో కూడిన వంట సరుకులు, సీజనల్‌గా వచ్చే పండ్లు సరఫరా చేయాలని సంబంధిత ఏజెన్సీదారులను ఆయన ఆదేశించారు. శుక్రవారం నాడు ఐటీడీఏ సమావేశం మందిరంలో అధికారులు, జిల్లా పర్చేజ్ కమిటీ సభ్యులు, ఏజెన్సీల యజమానుల సమక్షంలో టెండర్ బాక్స్ ఓపెన్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 19 గురుకుల పాఠశాలలో, 8 ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించడానికి టెండర్ ప్రక్రియ నిర్వహించారు. వస్తువుల సరఫరా విషయంలో ఏమైనా ఫిర్యాదులు వస్తే ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

33 కేవీ స్విచ్ స్టేషన్ ప్రారంభం



స్విచ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జీఎం రామచందర్

మణుగూరుటౌన్, జూన్ 28: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని సి-టైప్ కాలనీ ఏరియాలో శుక్రవారం 33 కేవీ స్విచ్ స్టేషన్‌ను ఏరియా జీఎం దుర్గం రామచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.20 లక్షల విలువైన విద్యుత్ పరికరాలు, రూ.10 లక్షల విలువైన సివిల్ పనుల నిమిత్తం నిధులు మంజూరు చేసి పూర్తి స్థాయిలో ఏరియా వర్క్‌షాప్‌కు చెందిన అధికారులు, టెక్నీషియన్‌లు ఈ స్విచ్ స్టేషన్ నిర్మించారన్నారు. దీని నిర్మాణ ప్రధాన ఉద్దేశ్యం గుట్టమల్లారంలోని 33/11 కేవీఎస్ఎస్ నుంచి 11 కేవీ డొమెస్టిక్ పవర్ ఫీడర్, 11 కేవీ ఇండస్ట్రియల్ పవర్ ఫీడర్‌లు ఉన్నాయన్నారు. వీటితోపాటు మణుగూరు నుంచి 220/132/33కేవీఎస్ఎస్ ఇండస్టియల్ కోసం పవర్ ఫీడర్ ఉందన్నారు. ఏరియాలో విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు స్విచ్ స్టేషన్‌ను నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, ప్రాజెక్ట్ అధికారి వీరభద్రరావు, డీజీఎం పర్సనల్ రమేష్, డీజీఎం కేసీహెచ్‌పీ మదన్‌నాయక్, డీజీఎం ఫైనాన్స్ అనురాధ పాల్గొన్నారు.

నూతన క్రేన్ ప్రారంభం

సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాకు నూతనంగా సింగరేణి యాజమాన్యం కేటాయించిన 10 టన్నుల సామర్థ్యంగల క్రేన్‌ను శుక్రవారం ఏరియా జీఎం దుర్గం రామచందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్ రమేష్, మదుసూదన్, వి.కృష్ణంరాజు, సీఎంవోఏఐ అధ్యక్షుడు కృష్ణమూర్తి, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ఎస్ఐకి ఘన సన్మానం



ఎస్ఐని సన్మానిస్తున్న దృశ్యం

ములకలపల్లి, జూన్ 28: ములకలపల్లి శివాలయకమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అర్చకులు సురేష్ శర్మ నేతృత్వంలో ములకలపల్లి ఎస్ఐ రాజమౌళికి ఘనంగా సన్మానించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో ఆశీర్వచనం అందజేశారు. ఇటీవల శివాలయంలో జరిగిన చోరీలో 24 గంటల్లోపు దొంగలను గుర్తించి పట్టుకుని దొంగలించిన వస్తువులు రికవరీ చేసి ఆలయంకు అందించడం పట్ల పోలీస్ సిబ్బంది ఎస్ఐ రాజమౌళి కృషిని ఆలయ కమిటీ చైర్మన్ నరాటి ప్రసాద్ అభినందించారు.

బొగ్గు వేలం పాటను నిలిపివేయాలి

భద్రాచలం జూన్ 28: బొగ్గు వేలం పాటను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యం లో శుక్రవారం బస్టాండ్ వద్ద ప్ల కార్డులు పట్టుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ బొగ్గు బావులను వేలంపాట ద్వారా ప్రైవేటు సంస్థలకు అప్పచెప్పాలని కేంద్ర ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని అన్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ ను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వేలం వేస్తున్నదని సింగరేణి కంపెనీ కూడా ప్రైవేటు సంస్థలతో పాటు వేలంపాటలు పోటీ పడాలని అనుకోవటం సరైనది కాదని వారు అన్నారు. బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థ ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వారి ప్రయోజనాల కోసమే నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగానే బొగ్గు బావులను ప్రైవేటు సంస్థలకు అప్పచెప్పేందుకు వేలం పాటను నిర్వహించటం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట రామారావు, గంగా, .లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు సీతాలక్ష్మి నాగరాజు, జీవనజ్యోతి, లక్ష్మి కాంత్, భూపేంద్ర, శాఖ కార్యదర్శులు రామకృష్ణ, రాధా, నాగలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శిస్తున్న సీపీఎం శ్రేణులు

చంద్రుగొండలో డ్రైనేజీ నిర్మాణం జరిగేనా..?

చంద్రుగొండ, జూన్ 28: మండల కేంద్రమైన చంద్రుగొండలో నిర్మించ తలపెట్టిన డ్రైనేజీ నిర్మాణం కోసం శుక్రవారం ఆర్అండ్‌బీ అధికారులు రోడ్లకు ఇరువైపుల కొలతలు తీశారు. ఈ సమయంలో ఇళ్ల తదితర నిర్మాణాలు కోల్పోతున్న వారి నుంచి తీవ్ర ఆగ్రహం, ఆందోళన వ్యక్తమవుగా, గ్రామస్తులు మాత్రం నిబంధనల ప్రకారం ఇరువైపుల 50 అడుగులు వద్ద డ్రైన్ న్మించాలని డిమాండ్ చేస్తున్నారు. చంద్రుగొండ ప్రధాన సెంటర్ నుంచి జూలూరుపాడు వెళ్లే రహదారితో పాటు బెండాలపాడు రహదారికి ఇరువైపుల డ్రైనేజీ నిర్మాణానికి గత అసెంబ్లీ ఎన్నికల ముందు రూ 3.12 కోట్లు నిధులు మంజూరైయాయి. ఆసమయంలో అప్పటి అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు భూమి పూజ చేశారు. అనంతరం ఎన్నికలు కోడ్ రావటంతో పనులు ప్రారంభం కాలేదు. కొత్తప్రభుత్వం వచ్చిన తరువాత అధికారులకు ఎటువంటి ఆదేశాలు రాకపోవటంతో ఆరు నెలలుగా డ్రైన్ పనులు చేపట్టలేదు. తిరిగి పనులు ప్రారంభానికి అధికారులు సిద్ధమయ్యారు.

ఉన్నత విద్యను సద్వినియోగం చేసుకోవాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట రూరల్, జూన్ 28: అశ్వారావుపేటలో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ప్రవేశాలు పొంది ఉన్నత విద్య సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. కళాశాలలో ఏర్పాటు చేసిన కోర్సులు, ప్రవేశాల ఆన్‌లైన్ ప్రక్రియకు సంబంధించి ముద్రించిన బ్రోచర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అశ్వారావుపేట ప్రాంత వాసులు డిగ్రీ చదివేందుకు సుదూర ప్రాంతాలు వెళ్లకుండా ఉండేలా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరి విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి చేరాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు రాంబాబు, శ్రీనివాస్, వీరారెడ్డి, చెన్నారావు తదితరులు ఉన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో చంద్రమౌళి

పాల్వంచ రూరల్, జూన్ 29: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీపీవో చంద్రమౌళి కోరారు. శుక్రవారం జగన్నాధపురంలో సికిల్‌సెల్ వ్యాధి వల్ల ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. గిరిజన గ్రామాల్లో సికిల్‌సెల్, అనిమియా లక్షణాల వల్ల చేతులు, కాళ్లు వాపులు రావడం వంటి లక్షణాలు ఉంటాయని చెప్పారు. ప్రతి గ్రామంలో ఆరోగ్య కేంద్రాల్లో సికిల్‌సెల్ అనిమియా టెస్టులు చేయించుకోవాలన్నారు.

వేలంలో సింగరేణి పాల్గొనాలి

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 28: సింగరేణి బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణపై రాజకీయాలు చేయకుండా సింగరేణి యాజమాన్యం బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనాలని బీఎంఎస్ జాతీయ నాయకులు మాధవ నాయక్ డిమాండ్‌చేశారు. బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణపై అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం బీఎంఎస్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణ పై గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి సింగరేణి యాజమాన్యం బొగ్గుబ్లాక్‌ల వేలంలో పాల్గొనాలని కోరారు. బొగ్గుబ్లాక్‌లను సాధించుకోవడం ద్వారా సింగరేణి మనుగడకు ఎలాంటి ఢోకా లేదన్నారు. బొగ్గుబ్లాక్‌ల వేలంలో పాల్గొనకుండ నామినేషన్ పద్ధతిలో గనులు కేటాయించకుండా 14శాతం రాయల్టీ టాక్స్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందని తెలిపారు. సింగరేణి సంస్థ మనుగడ కోసం పోరాటం చేస్తున్నట్లు కొన్ని రాజకీయ పార్టీలు ప్రచారంచేసుకుంటు పబ్బం గడుపుకుంటున్నాయని ఆరోపించారు. ఇలాంటి అబద్ధపు ప్రచారం వల్ల సింగరేణి సంస్థకు, కార్మికులకు అన్యాయం చేసినట్లు అవుతుందని తెలిపారు. సింగరేణి సంస్థ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని బొగ్గుబ్లాక్‌ల వేలంపాటలో సింగరేణి సంస్థ పాల్గొనాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్పొరేట్ ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, నాయకులు పవన్ కుమార్, వెంకటరెడ్డి, గణేష్, శ్రీనివాస్, రవి, నాగ ప్రసాద్ పాల్గొన్నారు.



9 మాట్లాడుతున్న మాధవ్ నాయక్

పీడీపై చర్యలు తీసుకోవాలని ధర్నా

జూలూరుపాడు, జూన్ 28: జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో 6వ తరగతి విద్యార్థిని కొట్టిన వ్యాయామ ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జూలూరుపాడు ఉన్నత పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సదరు ఉపాధ్యాయురాలుపై గతంలో అనేక ఆరోపణలు వచ్చిన విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం తగదన్నారు. సంఘటన స్థలానికి ఎంఈఓ గుగులోత్ వెంకట్ వచ్చి జరిగిన సంఘటనపై విచారణ జరిపి రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో నాయకులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జమ్మి యశ్వంత్, నాయకులు పవన్, బాలాజీ, అభిమిత్ర పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన ఆందోళన

ఇల్లెందు టౌన్, జూన్ 28: ఇల్లెందు మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పీఎఫ్, ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. రెండు రోజులుగా సమ్మె చేపట్టిన కాంట్రాక్టు కార్మికులు రెండోరోజు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకూబ్‌షావలి, సీఐటీయూ జిల్లా నాయకులు తాళ్లూరి కృష్ణలు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు అధికారులు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రెండురోజులుగా తమ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదన్నారు. కార్మికులతో చర్చలు జరిపిన కమిషనర్ వేతనాలు చెల్లించేందుకు అంగీకరించడం లేదని ఆరోపించారు. కనీసం మేడే కానుకైన చెల్లించాలని కోరారు. ఇల్లెందు మున్సిపాలిటీ పరిస్థితిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ, సీఐటీయూ నాయకులు వీరన్న, గురునాథం, మహేష్, కుమార్, సంధ్య, ఎల్లాబాయి, వరలక్ష్మి, భాగ్యమ్మ, రాజమ్మ, వెంకటమ్మ, పుష్ప, శ్రీను, సాంబరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నెంబర్ ప్లేట్ లేని వాహనాలు వాడొద్దు

కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో నరేష్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 28: నెంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే వాహనదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వో కె.నరేష్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో పలు ప్రాంతాలలో వాహనాలను తనిఖీ చేసి నెంబర్ ప్లేట్ లేని వాహనాలను అదుపులోకి తీసుకొని ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాలనుసారం కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ పర్యవేక్షణలో ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. వాహన దారులు తమ వాహనానికి ముందు వెనుక నెంబర్ ప్లేట్ తప్పక ఉండేలా చూసుకోవాలన్నారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం వివిధ రకాల స్టిక్కర్లను నెంబర్ ప్లేట్‌లపై వేయడం చట్ట రీత్యా నేరమన్నారు. అలాంటి వాహనాలను గుర్తించి సీజ్ చేస్తామని అన్నారు. వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి, పోలీసులకు సహకరించాలని కోరారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌హెచ్‌వో

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే



జూలూరుపాడు, జూన్ 28: అర్హులైన పేదలందరికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన జూలూరుపాడులోని శుభకార్యల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఎదురైన ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి తప్పనిసరిగా అమలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ మధుసూదనరావు, పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, నాయకులు నున్నా కృష్ణయ్య, వేల్పుల నరసింహారావు, మోదుగ రామకృష్ణ, పోతురాజు నాగరాజు, నవీన్ రాథోడ్, వెంకటనారయణ పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించాలి'

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 28: స్కానింగ్ సెంటర్‌లు నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుకృత హెచ్చరించారు. శుక్రవారం కొత్తగూడెం పట్టణంలో స్కానింగ్ సెంటర్లు, క్లీనిక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఆసుపత్రిలో రక్త పరీక్ష కేంద్రాలు ఉండాలన్నారు. క్లీనిక్‌లో ఫిజియోథెరపీ, ఆయుష్, సిద్ద, యునానీ, ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ చైతన్య, డిప్యూటీ డెమో ఫైయిజ్ మోహినుద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ క్లెయిమ్‌లను పూర్తి చేయాలి

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 28: సింగరేణి కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ క్లెయిమ్‌లను వెంటనే పూర్తి చేయాలని సింగరేణి జనరల్ మేనేజరు (పర్సనల్) బీఆర్.దీక్షితులు కోరారు. శుక్రవారం సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి వివిధ ఏరియా పర్సనల్ మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్‌గ్రౌండ్‌మైన్ నుంచి ఓపెన్‌కాస్టుకు ఓపెన్ కాస్టుకు పని చేసే ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి ఉద్యోగికి సంబంధించిన ఆరోగ్య సంరక్షణ కొరకు హెల్త్‌చెకప్ చేసేందుకు ప్రణాళికను రూపొందించాలన్నారు. కార్మికులకు సంబంధించిన క్వార్టర్ల వివరాలను కంప్యూటరీకరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు విలాస్, కోటేదార్, వెంకటేశ్వరరావు, అజయ్‌కుమార్, వర ప్రసాద్, ముకుంద సత్యనారాయణ, అనీల్, శివకుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర చట్టాన్ని అమలుచేయాలి

జూలూరుపాడు, జూన్ 28: వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టాన్ని అమలుచేసి రోజు వారి వేతనం రూ. 600 అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షురాలు కంగాల వెంకటమ్మ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బాణోత్ ధర్మా కోరారు. వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడులో తహసీల్దార్ స్వాతిబిందుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగుకు సంబంధించిన పనులన్నిటిని కార్మికులే చేపడుతున్నప్పటికి వారికి చాలీచాలని వేతనాలు అందిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి సరైన వేతనాలు ఇవ్వాలని కోరారు.

సైబర్ క్రైంపై అవగాహన కలిగి ఉండాలి

మణుగూరుటౌన్, జూన్ 28: ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైంపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సీఐ సతీష్‌కుమార్ అన్నారు. మణుగూరు పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమ చదువుతోన్న విద్యార్థులకు సైబర్ క్రైంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ క్రైం, డ్రగ్స్, మోటార్ బైక్, కార్ల రాష్ డ్రైవింగ్‌లకు సంబంధించిన నేరాలు, శిక్షలు, జరగబోయే నష్టం తదితర అంశాలను వివరించి అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ ప్రతీ విద్యార్థికి ఒక భాగమైపోయిందన్నారు. సెల్‌ఫోన్‌ను సక్రమంగా వినియోగించుకుంటే ఎటువంటి నష్టం లేదని, పొరపాటున తెలియని ఫోన్ నంబర్లతో వచ్చే ఫోన్లను లిఫ్ట్ చేయడం, ఇష్టానుసారంగా ఫోన్‌లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయడం, ఆఫర్లకు, ప్రోత్సాహకాలకు, ఇతరత్రా బహుమతులకు ఆశపడి వ్యక్తిగత వివరాలను అందజేయడం, ఈజీ మని ఎర్నింగ్ కోసం ఇష్టానుసారంగా నగదు లావాదేవీలు చేయడం లాంటి పనులు చేయరాదన్నారు. ఇతరుల వ్యక్తిగతానికి సంబంధించి అవమానపరిచేలా ఉండే మెసేజ్‌లు పెట్టడం, వాటిని ఫార్వార్డు చేయడం కూడా నేరాలుగానే పరిగణించబడుతాయన్నారు. కావున విద్యార్థులు మొబైల్ ఫోన్‌లను అశ్లీల వెబ్‌సైట్‌లు చూసేందుకు, ఇష్టానుసారంగా వెబ్ లింక్‌లు ఓపెన్‌చేసి సైబర్ క్రైంలలో ఇరుక్కోవద్దని సూచించారు. సైబర్ క్రైంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఇల్లెందు టౌన్, జూన్ 28: ఆటో డ్రైవర్లు కొత్త చట్టాలపై అవగాహణ పెంపొందించుకుని నిబంధనలు పాటించాలని లేని యెడల కఠిన చర్యలు తీసుకుంటామని ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం ఇల్లెందు ఆటో డ్రైవర్లకు కొత్త చట్టాలపై అవగాహణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలకు నెంబరు ప్లేటు లేకుండ తిరగరాదన్నారు. లైసెన్స్, ఇన్సురెన్స్ లేకుండా సరైన ధృవపత్రాలు లేకపోతే తగిన విధంగా స్పందిస్తామని ప్రకటించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని హెచ్చరించారు. ఎటువంటి అసాంఘీక కార్యకలాపాలకు తావివ్వకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సందీప్‌తోపాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.